సాక్షి
ప్రకాశం

సోమవారం । 24 । మార్చి । 2025



ఇదేం పంచాయితీ !

సింగరాయకొండ మేజర్ పంచాయతీలో నిధుల వినియోగంపై వరుస ఎంక్వైరీ కమిషన్లు నియమిస్తున్న తీరు వివాదాస్పదం అవుతోంది. - 8లో..



శ్రీశైలానికి పెరిగిన భక్తుల రద్దీ

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
35/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు పడవచ్చు.

రంజాన్ వేళలు

సోమవారం ఇఫ్తార్
సాయంత్రం గం 6 : 30
మంగళవారం సహారి
ఉదయం గం 4 : 52

న్యూస్‌రీల్

వైవీని పరామర్శించిన బూచేపల్లి



వై.వి.సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని ఒంగోలులోని ఆయన నివాసానికి వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ మృతి చెందిన నేపథ్యంలో వై.వి.సుబ్బారెడ్డి, వై.వి.భద్రారెడ్డి ని పరామర్శించారు.

పసుపు పంటను పరిశీలించిన ఉద్యానవన శాఖాధికారిణి



పసుపు రైతుతో మాట్లాడుతున్న హెచ్‌ఓ శ్వేత

సాక్షి ఎఫెక్ట్..

కంభం: దిగుబడులు తగ్గి ధరలు లేక పసుపు రైతులు నష్టపోతున్న నేపథ్యంలో ఆదివారం 'సాక్షి' దినపత్రిక లో 'ప్రకాశించని పసుపు' అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన ఉద్యానవనశాఖ అధికారులు ఆదివారం పసుపు రైతులను కలిసి వివరాలు సేకరించారు. ఉద్యానవన శాఖాధికారిణి శ్వేత మాట్లాడుతూ పసుపు రైతులు దిగుబడులు తగ్గాయని చెబుతున్నారని, ప్రస్తుతం ధరలు కూడా సగానికి పడిపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని తెలిపినట్లు ఆమె చెప్పారు. పసుపు రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆమె తెలిపారు. గతేడాది క్వింటా ఎండు పసుపు ధర రూ.13 వేలు ఉంటే ప్రస్తుతం రూ.7 వేలకు పడిపోయిందని రైతులను ఆదుకోవాలని ఉద్యానవన శాఖాధికారిణి రైతులు కోరారు.

టోల్‌ప్లాజా సిబ్బందికి అస్వస్థత

- కాలం చెల్లిన గ్లూకోప్లస్– సీ ఇచ్చిన ఎక్స్‌ప్రెస్‌వే అధికారులు



సిబ్బందికి ఇచ్చిన కాలం చెల్లిన గ్లూకోప్లస్-సీ ప్యాకెట్


టంగుటూరు: తక్కువ జీతాలకు వెట్టి చాకిరీ చేయించుకుంటూ కనీసం సరైన సదుపాయాలు అందించాల్సిన సింహపురి ఎక్స్‌ప్రెస్ వే అధికారులు రెండు రోజుల క్రితం ఇచ్చిన గ్లూకోప్లస్-సీ తాగిన టోల్‌ప్లాజా సిబ్బంది తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. టోల్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. పెరుగుతున్న ఎండల నేపథ్యంలో వేడిమి బారిన పడకుండా ఎక్స్‌ప్రెస్ వే అధికారులు గ్లూకోప్లస్-సీ అందిస్తున్న సమయంలో ఒకరు అది కాలం చెల్లిందని గమనించి అధికారులకు తెలిపాడు. అయితే అప్పటికే కొంత మంది తాగగా 10 మందికి కడుపులో తీవ్ర నొప్పి రావటంతో స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు.

అయితే టోల్ ప్లాజా అధికారులు మాత్రం జరిగిన సంఘటన బయటకు పొక్కకుండా సిబ్బంది నోరు నొక్కారు. దీంతో సిబ్బంది తాము చూశాము కాబట్టి బయటపడిందని, ఇలా కాలం చెల్లిన ఆహార పదార్థాలు ఎన్ని సార్లు ఇచ్చారో తెలియడం లేదని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా ఆరోగ్య అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

- విద్యా వనాల్లో కీచక పర్వాలు

గురుముఖ వ్యాఘ్రాలు

విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులు కట్టుతప్పుతున్నారు. విద్యా వనాల్లో కలుపు మొక్కలుగా తయారవుతున్నారు. కంటికి రెప్పలా కాపాడాల్సిన చిన్నారులపై కన్నేసి కీచకులుగా మారుతున్నారు. వెకిలి చేష్టలతో విద్యా వ్యవస్థకు కళంకం తెస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలపై ఉపాధ్యాయులు అకృత్యాలకు పాల్పడుతున్న సంఘటనలు వరుసగా వెలుగుచూస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి ఘటనలపై కఠినంగా వ్యవహరించాల్సిన అధికారులు మొక్కుబడి చర్యలతో సరిపెట్టడం విచారకరం.



- కాపాడాల్సిన గురువులే కాటేస్తున్నారు
- జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు రక్షణ కరువు
- వరుస ఘటనలతో తల్లిదండ్రుల ఆందోళనలు
- తూతూ మంత్రంగా విచారణ చేస్తున్న వైనం
- డీఈఓ తీరుపై మండిపడుతున్న తల్లిదండ్రులు

ఒంగోలు సిటీ: తల్లిదండ్రుల తరువాత అంత బాధ్యతగా పిల్లల భవితను తీర్చిదిద్దాల్సిన గురువులు తమ స్థానాన్ని మరిచి దిగజారుతున్నారు. మద్దిపాడు, టంగుటూరు..కొనకనమిట్ల..కనిగిరి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలపై చదువులు చెప్పాల్సిన ఉపాధ్యాయులు అసభ్యంగా ప్రవర్తిస్తున్న సంఘటనలు వరుసగా వెలుగు చూడడం విద్యా వ్యవస్థకే కళంకం తెస్తోంది. ఉన్నత భవితకు బాటలేసుకోవాల్సిన సరస్వతీ నిలయాల్లోనే బాలికలకు భద్రత కరువైంది. ఎన్ని కఠిన చట్టాలు ఉన్నా అమలుకు నోచుకోకపోవడంతో కీచకులు బరితెగిస్తున్నారు. ఇటీవల మద్దిపాడు మండలంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై విచారణ జరిపి అతనిని సస్పెండ్ చేశారు. అలాగే జిల్లాలో టంగుటూరు కేంద్రానికి సమీపంలోని ఓ పాఠశాలలో చదువుతున్న బాలికపై ఉపాధ్యాయుడు లైంగిక దాడికి పాల్పడడం సంచలనంగా మారింది. నాలుగో తరగతి చదువుతున్న ఆ బాలిక ఇంటికి వచ్చిన తర్వాత దుస్తులపై రక్తపు మరకలు ఉండటాన్ని గమనించిన తల్లి ఆందోళనకు గురైంది. ఏం జరిగిందన్న విషయాన్ని ఆరాతీసింది. విషయం తెలుసుకుని నివ్వెరపోయింది. విషయాన్ని సమీపంలోని పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలిని మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తీసుకొచ్చింది. బాధితురాలికి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పాల్సిన ఓ మహిళా కానిస్టేబుల్ వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. రోజులు గడుస్తున్నా పోలీసులు, విద్యాశాఖ అధికారులు నిందితునిపై చర్యలు తీసుకోకపోవడంతో ఆమె తన బంధువుల సాయంతో సామాజిక మాధ్యమాల్లో వీడియోను విడుదలజేసింది. ఇది సంచలనం రేకెత్తించడంతో పోలీసులు ఆఘమేఘాలపై కేసులు కట్టారు. విద్యాశాఖ అధికారులు అతనిని సస్పెండ్ చేస్తూ ఆదేశాలిచ్చారు. ఎట్టకేలకు ఆ ఉపాధ్యాయుడిని అరెస్ట్ చేసి కటకటాల్లోకి నెట్టారు.

బాలల హక్కుల సభ్యురాలి తనిఖీలో..

కొనకనమిట్ల మండలంలో పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించేందుకు బాలల హక్కుల సంఘం సభ్యురాలు బత్తుల పద్మావతి తనిఖీకి వెళ్లారు. ఆ సమయంలో అక్కడ చదువుతున్న విద్యార్థినులు ఒక ఉపాధ్యాయుడు తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆమె దృష్టికి తెచ్చారు. దీంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో ఇంత దారుణం జరుగుతున్నా పట్టించుకోకపోవడంపై ఆమె మండిపడ్డారు. వెంటనే సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ జరిపి ఆ ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ సంఘటనలు మరువక ముందే కనిగిరి పట్టణంలో మరో కీచక ఉపాధ్యాయుడి ఉదంతం వెలుగుచూసింది. పట్టణంలోని ఓ పాఠశాలలో సైన్స్ టీచర్ బాలికల పట్ల వికృత చేష్టలపై బాధిత బాలికలంతా బయటకు చెప్పుకోలేక మదనపడిపోయారు. అతని చేష్టలు శ్రుతిమించడంతో పది రోజుల ముందే ప్రిన్స్‌పాల్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె డీఈఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు ఉపాధ్యాయుడికి మెమో ఇచ్చి వదిలేయడం వివాదాస్పదంగా మారింది. ఈక్రమంలో ఓ బాలికకు రుతుస్రావం అయినప్పుడు తీవ్ర ఇబ్బంది పడటంతో ఏమైందని తల్లిదండ్రులు ప్రశ్నించడంతో సదరు ఉపాధ్యాయుడి వికృత చేష్టల గురించి బాలిక వివరించింది. వారు బాలికకు వైద్యపరీక్షలు చేయించారు. అనంతరం ఆ ఉపాధ్యాయుడి ఇంటిని బంధువులతో కలిసి ముట్టడించారు. అదే సమయంలో పోలీసులు వచ్చి టీచర్‌ను అదుపులోనికి తీసుకున్నారు. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ప్రధానోపాధ్యాయురాలిపై కూడా కేసు నమోదు చేశారు.

క్షోభకు గురవుతున్న తల్లిదండ్రులు..

పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలను బాగా చదివించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తే ఉపాధ్యాయులు చేసిన నిర్వాకం వల్ల తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారు. లైంగిక దాడికి గురైన కుటుంబాలకు న్యాయం జరగకపోవడంతో బయట తలెత్తుకోలేకపోతున్నారు. సూటిపోటి మాటలతో బంధువులు, ఇరుగుపొరుగు వారు అంటుండడంతో ఎలా జీవించాలో తెలియక భయాందోళనకు గురవుతున్నారు. ఇకనైనా విద్యాశాఖ అధికారులు లైంగిక దాడి చేసిన కీచక ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వివాదాస్పదంగా విద్యాశాఖ అధికారి తీరు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులపై విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులే అకృత్యాలకు పాల్పడుతున్న సంఘటనలు వరుసగా వెలుగు చూస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తుండడం గమనార్హం. వరుసగా జరుగుతున్న సంఘటనలపై మొక్కుబడిగా చర్యలు తీసుకుని మమ అనిపిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనిగిరి పాఠశాలలో విద్యార్థినులపై ఉపాధ్యాయుడు లైంగికంగా వేధిస్తున్నాడని ప్రధానోపాధ్యాయురాలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే మెమో ఇవ్వాలని ఆదేశాలివ్వడం ఎంతవరకు సబబని బాధిత తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ లేఅవుట్‌పై కూటమి పార్టీల రగడ

- ఒకరు రాళ్లు వేయించారు.. ఒకరు పీకించారు



కేబిట్రగుంట అక్రమ లేఅవుట్‌లో రాళ్లు తొలగిస్తున్న దృశ్యం

జరుగుమల్లి(సింగరాయకొండ): టీడీపీ వర్గానికి చెందిన వారు వేయించిన అక్రమ లేఅవుట్‌పై కూటమిలోని జనసేన నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆమె ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది లేఅవుట్‌లో హద్దురాళ్లు తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. జరుగుమల్లి మండలం కే బిట్రగుంట గ్రామంలో సర్వే నంబరు 468-3ఏలోని 1.97 ఎకరాల్లో తమ్ముళ్లు లేఅవుట్ వేసి ప్లాట్ల అమ్మకం చేపట్టారు. ఈ లేఅవుట్ పై ఫిర్యాదులు రావటంతో పంచాయతీ కార్యదర్శి షేక్ షఫీ ఇది అక్రమ లేఅవుట్ అని బోర్డు పెట్టి హద్దు రాళ్లు తొలగించకుండా వదిలేశారు. రెవెన్యూ శాఖ వారు ల్యాండ్ కన్వర్షన్ అయింది.. మా పని పూర్తయిందని చేతులు దులుపుకోగా పంచాయతీ వారు బోర్డు పెట్టాం కదా ఇంకేంటని వారు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరించారు. అయితే లేఅవుట్‌లో బోర్డు పెట్టిన అరగంట లోనే తమ్ముళ్లు మా లేఅవుట్‌లో బోర్డు ఎలా పెడతారని పీకేసి ప్లాట్ల అమ్మకాలు చేపట్టారు. దీనిపై స్థానిక జనసేన నాయకుడు ఇది అక్రమ లేఅవుట్ అని, పంట కాలువ ఆక్రమించారని, అలాంటప్పుడు ఈ ల్యాండ్ కన్వర్షన్ ఎలా చేస్తారని, పంచాయతీ వారికి నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన 10 శాతం స్థలం ఇవ్వకుండా లేఅవుట్ వేసి అమ్మకాలు సాగిస్తున్నారని మీకోసం లో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జేసీ గోపాలకృష్ణ ఆదేశాలతో ఆదివారమైనా కూడా సిబ్బంది లేఅవుట్‌లోని హద్దురాళ్లు తొలగించారు. అయితే గత ఆదివారం రెవెన్యూ సిబ్బంది రాళ్లు తొలగిస్తున్నట్లు ఫొటోలకు పోజులిచ్చి రాళ్లు తొలగించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కూటమిలోని రెండు పార్టీల మధ్య వివాదం ఇప్పుడు మండలంలో చర్చనీయాంశంగా మారింది.

పచ్చ పార్టీలో ముసలం

- ప్రముఖ రెస్టారెంట్‌లో సమావేశమైన ఎమ్మెల్యే దామచర్ల వ్యతిరేక వర్గం
- టీడీపీ కోసం కష్టపడినా గుర్తింపు లేదని కమ్మ సామాజిక వర్గం నేతల అసంతృప్తి
- ఎమ్మెల్యేతో సంబంధం లేకుండా సొంతంగా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం



సమావేశానికి హాజరైన కమ్మ సామాజికవర్గ నేతలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లా కేంద్రమైన ఒంగోలు తెలుగు దేశం పార్టీలో ముసలం మొదలైంది. సొంత సామాజిక వర్గం నాయకులే అసంతృప్తితో రగిలిపోతున్నారు. పార్టీ విజయం కోసం పనిచేసినా తమకు న్యాయం చేయకపోగా పక్కన పెడుతున్నారని అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఎన్నికలకు ముందు తమను వాడుకొని గెలిచిన తరువాత కరివేపాకులా తీసిపారేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదవులు, ప్రయోజనాలు ఆయనకు, త్యాగాలు, కష్టాలు మనకా అని ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ ఆదివారం నగరంలోని అద్దంకి బస్టాండు సెంటర్లోని ఒక రెస్టారెంటులో కమ్మ సామాజికవర్గానికి చెందిన నాయకులు, టీడీపీ కార్యకర్తలు సమావేశం నిర్వహించడం జిల్లాలో సంచలనం సృష్టించింది. నగరంలో చర్చనీయాంశమైంది.

రెండు నెలల నుంచి రాజుకుంటున్న అసంతృప్తి...

నిజానికి నేడు అసంతృప్తి వర్గం నిర్వహించిన సమావేశానికి రెండు నెలల ముందే బీజం పడినట్లు తెలుస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరికి ఏదో ఒక కీలకమైన పదవి ఇప్పిస్తానంటూ దామచర్ల ఆశ పెట్టినట్లు సమాచారం. అందరితో పాటు నగరానికి చెందిన ఒక కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యాపారికి కూడా హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. పేపర్ మిల్లులకు జామాయిల్ కర్ర సరఫరా చేస్తూ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న ఆ వ్యాపారి పదవిపై ఆశతో గత ఎన్నికల్లో బాగానే చెమటోడ్చినట్లు పార్టీలోని ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు చెప్పుకుంటున్నారు. ఆ వ్యాపారికి టిడ్కో కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తానని చెప్పినట్లు సమాచారం. తీరా ఎన్నికలై పోయిన తరువాత టిడ్కో కార్పొరేషన్ పదవి మరొకరికి ఇచ్చేశారు. పోనీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవైనా ఇవ్వమని సదరు వ్యాపారి అడిగినట్లు తెలుస్తోంది. దానికి నా చేతిలో ఏమీ లేదని జనార్ధన్ చేతులెత్తేయడంతో అసంతృప్తికి గురైన ఆయన నగరంతో పాటుగా జిల్లాలోని కమ్మ సామాజిక వర్గాన్ని ఏకం చేసే పనిలో పడినట్లు చెప్పుకుంటున్నారు. ఈ క్రమంలోనే కాకతీయ సంఘం పేరుతో రెస్టారెంటులో సమావేశం నిర్వహించినట్లు సమాచారం. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నిర్లక్ష్యానికి గురైన పలువురు సీనియర్ నాయకులు, దామచర్ల మోసం చేసినట్లు భావిస్తున్న యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. సమావేశంలో కమ్మ భవన్ నిర్మాణం, హాస్పిటల్ విషయంలో దామచర్ల సహకరించడం లేదని అసంతృప్తి వెళ్లగక్కారు. గత ఎన్నికల్లో పని చేసినప్పటికీ కమ్మ సామాజికవర్గానికి చెందిన నాయకులకు పదవులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని, కనీసం పార్టీ పదవులకు కూడా దూరంగా పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇక ఎమ్మెల్యే దామచర్లను నమ్ముకోవడం కంటే సొంతంగా పని చేయాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. ఈ పరిణామాలు ఎటు పోతాయోనని పచ్చ తమ్ముళ్లు తలలు పట్టుకుంటున్నారు.

ఇప్పటికే సత్యతో పోరు..

ఇప్పటికే ఎమ్మెల్యే జనార్దన్‌కు మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యకు ఏమాత్రం పొసగడం లేదు. ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుక్షణం నుంచే వీరి మధ్య పోరు స్టార్ట్ అయినట్లు తెలుస్తోంది. కార్పొరేషన్ పదవుల సమయంలో సత్యకు ఎలాంటి పదవి ఇవ్వవద్దని అధిష్టానం వద్ద జనార్దన్ చెప్పినట్లు తెలిసిన సత్య.. లోకేష్ ద్వారా పదవి కొట్టేసి పైచేయి సాధించాడు. దాంతో మనసులో కక్ష పెట్టుకున్న జనార్దన్.. సత్య పుట్టిన రోజు వేడుకలకు వేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బందితో తీయించడమే కాకుండా నగరంలో ఎక్కడా ఫ్లెక్సీలు వేయకుండా కమిషనర్ చేత నోటీసు ఇప్పించి కక్ష తీర్చుకున్నట్లు చెప్పుకుంటున్నారు. దీంతో ఇరువురి మధ్య వివాదం మరింతగా రాజుకుంది. ఈ నేపథ్యంలో జనార్దన్‌తో తాడో పేడా తేల్చుకునేందుకు సిద్ధపడిన సత్య నగరంలోని తన కార్యాలయంలో భారీగా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించి సవాల్ విసిరారు. పుట్టిన రోజు వేడుకలకు జిల్లా ఎమ్మెల్యేలను అడ్డుకోవడం ద్వారా సత్య స్పీడుకు బ్రేక్ వేసినట్లు చెప్పుకుంటున్నారు. ఈ విషయం జిల్లా టీడీపీలో సంచలనం సృష్టించింది. ఈ వివాదం మరచిపోక ముందే మళ్లీ ఈ సమావేశం జరగడంతో పార్టీ కార్యకర్తలకు మింగుడు పడడం లేదు.

సీటుకు పోటీ వస్తారన్న భయంతోనే...

ఇంతకూ ఇదంతా ఎందుకు చేస్తున్నారంటే మరో నాయకుడు ఎదిగితే తన సీటుకు ఎక్కడ ఎసరు వస్తుందోనన్న భయంతోనే ఎమ్మెల్యే దామచర్ల ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒంగోలు అసెంబ్లీ సీటుకు గతంలో నూకసాని బాలాజీ పోటీ పడ్డారు. దామచర్ల సత్య కూడా పోటీ పడ్డారు. అందుకే బాలాజీని ఒంగోలులో తిరగకుండా చేసినట్లు చెబుతారు. జిల్లా కేంద్రంలో జరిగే పార్టీ కార్యక్రమాలకు ఆయనను దూరంగా పెట్టడం ద్వారా ఆయన ఉనికే లేకుండా చేసినట్లు బీసీ నాయకులు మండిపడుతున్నారు. ఇక సత్య విషయంలో కూడా ఆయనకు అదే భయం వెన్నాడుతుందని పార్టీ శ్రేణులు చెప్పుకుంటున్నారు. సత్య కనుక ఒంగోలులో నిలబడితే తన సీటు కిందకు నీళ్లు రావడం ఖాయమని అందుకే ఆయనను కొండపికే పరిమితం చేస్తున్నారని వినికిడి. ఈ కారణం వల్లనే ఆయన ఒంగోలులో ద్వితీయ శ్రేణి నాయకులు ఎవరూ లేకుండా జాగ్రత్త పడుతున్నారని, ఎవరినీ ఎదగకుండా పదవులకు దూరం చేస్తున్నారని చెప్పుకుంటున్నారు.

దామచర్ల ఆధిపత్య పోరు..

జిల్లా తెలుగుదేశం పార్టీలో పెత్తనం నిలుపుకోవాలని ఎమ్మెల్యే జనార్దన్ మొదట్నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఇప్పటికే తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఉన్నప్పటికీ గుంటూరు రోడ్డులో సొంతంగా కార్యాలయం పెట్టుకున్నారు. రాష్ట్రం నుంచి వచ్చే మంత్రులు, నాయకులను జిల్లా కార్యాలయానికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ ఉనికిని సైతం సహించలేకపోతున్నారని టీడీపీలోని బీసీ నాయకులు చెప్పుకుంటున్నారు. అంతేకాకుండా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డాక్టర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ సమయంలో కూడా శిలాఫలకం మీద సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ కుమార్ పేరు లేకుండా చేసినట్లు ప్రచారం జరిగింది. చివరికి ఫ్లెక్సీల్లో ఆయన చిత్రం వేయడానికి కూడా అంగీకరించలేదని సమాచారం. దాంతో ఆవిష్కరణ సభకు వచ్చిన ఎమ్మెల్యే విజయకుమార్ మనస్తాపంతో సభ జరగక ముందే వెళ్లిపోయారు. అది గమనించిన సంతనూతలపాడు టీడీపీ నాయకులు రచ్చ రచ్చ చేశారు. జిల్లా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామితో కూడా ఆయనకు సత్సంబంధాలు లేవని పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. పశ్చిమ ప్రకాశానికి చెందిన ఒక కీలక ఎమ్మెల్యే బావమర్దిని రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ పదవి నుంచి రాజీనామా చేయించేందుకు ప్రయత్నించారు. ఆయనససేమిరా అనేసరికి కమిటీని రద్దు చేయాలని కలెక్టర్ మీద ఒత్తిడి తీసుకొని రావడం, సదరు ఎమ్మెల్యే బావమర్ది కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడం కూడా పచ్చ పార్టీలో గ్రూపు రాజకీయాలకు ఆజ్యం పోసిందని ప్రచారం జరుగుతోంది.

రాజకీయంగా ఎదుర్కోలేకే పోలీసు కేసులు



విలేకరులతో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్


యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గీయులను రాజకీయంగా ఎదుర్కోలేక పోలీసు కేసులు బనాయిస్తున్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. ఆదివారం త్రిపురాంతకం మండల పార్టీ నాయకుడు, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, దాడి కేసులు నమోదు చేసిన సంఘటనను వారు తీవ్రంగా ఖండించారు. ఆంజనేయరెడ్డిని శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత పోలీసులు కస్టడీలోకి తీసుకొని ఎవరికీ కనిపించకుండా చేయడాన్ని వారు తప్పుపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆంజనేయరెడ్డి దాడి చేశాడని పోలీసులు చెప్తున్న వ్యక్తిపై ఎటువంటి గాయాలు లేవని, కులం పేరుతో దూషించినట్లు ఎటువంటి ఆధారాలు లేవని, అటువంటి సమయంలో యర్రగొండపాలెం పోలీసులు విచారణ చేపట్టకుండా ఆయనను ఏ విధంగా అరెస్ట్ చేశారని వారు ప్రశ్నించారు. ఈ నెల 27వ తేదీ ఎంపీపీ ఎన్నిక ఉండటం వలన ఆంజనేయరెడ్డి ఎంపీపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండటంతో కావాలని నాటకీయంగా టీడీపీ వాళ్లతో కలిసి మూకుమ్మడిగా ఆయనను నిర్బంధించారని వారు అన్నారు. ఇంతకంటే దౌర్జన్యం ఎక్కడా లేదని, ఎస్పై తన విధులను మరచి టీడీపీ కార్యకర్తగా పనిచేస్తున్నాడని, ఈ ఎన్నికలు జరగకుండా ఉండేందుకు ఆంజనేయరెడ్డిని అరెస్ట్ చేశారని వారు అన్నారు. ముందుగా పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఆంజనేయరెడ్డిని వారు పరామర్శించి ధైర్యం చెప్పారు. వారి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఒంగోలు మూర్తిరెడ్డి, కె.ఓబులరెడ్డి, ఏకుల ముసలారెడ్డి ఉన్నారు.

వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

త్రిపురాంతకం మండలానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ సభ్యులు ఆళ్ల ఆంజనేయరెడ్డి, ఎస్.సుబ్బారావులపై ఆదివారం యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, గొడ్డలితో దాడి చేసినట్లు కేసులు నమోదయ్యాయి. శనివారం రాత్రి మార్కాపురం రోడ్డులో తాము ఉన్న సమయంలో ఆంజనేయరెడ్డి, సుబ్బారావులు కలిసి కులం పేరుతో దూషించారని, గొడ్డలి తీసుకొని దాడి చేయడం వలన భుజంపై వాపు వచ్చిందని త్రిపురాంతకం అంబేద్కర్ కాలనీకి చెందిన ఎం.సుందరబాబు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

ఉరకలెత్తించిన ఒంగోలు గిత్తలు

- ముగిసిన జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



బండ లాగేందుకు ఉరకలేస్తున్న కోడె గిత్తలు

కొనకనమిట్ల: వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా వెలుగొండ క్షేత్రంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సీనియర్ విభాగంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు ఆదివారం ఉత్సాహంగా ముగిశాయి. ఒంగోలు గిత్తలు రంకెలేస్తూ ప్రజలను ఉత్సాహపరిచాయి. మేకలవారిపల్లి రెడ్ల సంఘం పర్యవేక్షణలో నిర్వహించిన ఎడ్ల పోటీలను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. సేద్యపు ఎడ్ల బల ప్రదర్శన పోటీలు చూసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ప్రకాశం, గుంటూరు, నంద్యాల, కర్నూలు, బాపట్ల జిల్లాల నుంచి ఎనిమిది జతల ఎడ్లు పోటీలో తలపడ్డాయి.

సత్తాచాటిన వైఎస్సార్ కడప జిల్లా ఎడ్లు..

సీనియర్ విభాగంలో నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పందేల్లో వైఎస్సార్ కడప జిల్లా ఎడ్లు తమ సత్తా చాటాయి. కడప జిల్లా చౌటపల్లికి చెందిన మార్తాల చంద్రోబులరెడ్డి ఎడ్లజత నిర్ణీత 20 నిముషాల్లో 3759 అడుగులు లాగి మొదటి బహుమతి సాధించుకున్నాయి. నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం రాంభూపాల్‌రెడ్డి ఎడ్ల జత 3743 అడుగులు లాగి రెండో స్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన ఆర్‌కే బుల్స్ శిరీషా చౌదరి ఎడ్ల జత 3644 అడుగులు లాగి మూడో స్థానంలో సాధించాయి. బాపట్ల జిల్లా పీవీఎస్ఆర్ బుల్స్ వీరాస్వామిచౌదరి 3755 ఎడ్ల జత 2756 అడుగులు లాగి నాలుగో స్థానంలో, నంద్యాల జిల్లా జిల్లెల్ల గ్రామం నాగిరెడ్డి ఎడ్ల జత 3302 అడుగులు లాగి ఐదో స్థానంలో, ప్రకాశం జిల్లా వీరాయపాలేనికి చెందిన పెద్దచాంద్ ఎడ్లజత 3272 అడుగులు లాగా ఆరో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు ఆలయ ఆవరణలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి, ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, దాతల సహకారంతో అందజేసిన నగదును వరుసగా ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు బహుమతులను రూ.80, రూ.60, రూ.40, రూ.20, రూ.15, రూ.10 వేలు అందజేశారు.

క్లుప్తంగా

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై, సిబ్బంది

నాగులుప్పలపాడు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన ఏజర్ల యేసుపాదం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. అతని వద్ద 25 క్వార్టర్ బాటిళ్లు, తొమ్మిది 90 ఎంఎల్ బాటిళ్లు ఉండటంతో స్వాధీనం చేసుకున్నారు. యేసుపాదంను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్‌కార్డుదారులు 31లోగా ఈకేవైసీ చేయించుకోవాలి

సంతనూతలపాడు: జిల్లాలో ఈకేవైసీ చేయించుకోని రేషన్‌కార్డుదారులంతా ఈ నెల 31వ తేదీలోగా రేషన్ డీలర్ల వద్ద తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారిణి ఎస్.పద్మశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో 6,61,206 బియ్యం కార్డులు ఉన్నట్లు తెలిపారు. వాటిలో 19,37,977 మంది సభ్యులు కలరన్నారు. ఇప్పటి వరకూ 17,31,913 మంది సభ్యులు ఈకేవైసీ చేయించుకున్నారని వెల్లడించారు. మిగిలిన 2,06,064 మంది సభ్యులు ఈ నెల 31వ తేదీలోగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేయించుకోవాలని పద్మశ్రీ కోరారు. రాష్ట్రమంతా ఈపీడీఎస్ విధానం అమల్లో ఉన్నందున కార్డుదారులు, సభ్యులు వేరువేరు ప్రాంతాల్లో ఉంటే వారి రేషన్ కార్డు, ఆధార్ కార్డు ద్వారా సమీపంలోని రేషన్ డీలర్ల వద్ద ఈకేవైసీ చేయించుకోవచ్చని డీఎస్ఓ వివరించారు. ఈకేవైసీ కోసం జిల్లాలోని రేషన్ దుకాణాలు అందుబాటులో ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. ఐదు సంవత్సరాలుపైబడిన సభ్యులు మాత్రమే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఇందులో భాగంగా సంతనూతలపాడు మండలం మైనంపాడులో ఈకేవైసీ ప్రక్రియను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గుణవంశీ ఆదివారం పర్యవేక్షించారు.

ఉరేసుకుని ఉపాధ్యాయిని ఆత్మహత్య

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా విధులు నిర్వర్తిస్తున్న చదలవాడ పద్మజ(52) ఆదివారం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పద్మజకు భర్త శ్రీనివాసులు, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టామని పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు.

ఇదేం పంచాయితీ?

- సింగరాయకొండ పంచాయతీలో రెండేళ్లలో ఆరు పర్యాయాలు విచారణ కమిషన్లు
- ఫిర్యాదు చేయడమే ఆలస్యం.. ఎంక్వైరీ కమిషన్ వేసిన జిల్లా అధికారులు
- ఉద్దేశపూర్వక ఫిర్యాదులని పీఆర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తే మళ్లీ విచారణ కమిషన్
- దళిత మహిళను అనే కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడుతోందని సర్పంచ్ ఆవేదన
- పంచాయతీలో ప్రస్తుతం సాగుతున్న అవినీతిపై విచారణ చేపట్టాలని డిమాండ్



సింగరాయకొండ గ్రామ పంచాయతీ కార్యాలయం

సింగరాయకొండ: సింగరాయకొండ మేజర్ పంచాయతీలో నిధుల వినియోగంపై వరుస ఎంక్వైరీ కమిషన్లు నియమిస్తున్న తీరు వివాదాస్పదంగా మారుతోంది. ఓ వ్యక్తి అర్జీ ఇవ్వడమే ఆలస్యం వరుసగా ఐదు పర్యాయాలు ఎంక్వైరీ కమిషన్లు వేయగా.. 'నిజాలు త్వరగా నిగ్గు తేల్చండి' అని సర్పంచ్ కోరిన పిదప మరో ఎంక్వైరీ కమిషన్ వేయడం జిల్లా పంచాయతీ అధికారుల తీరును తేటతెల్లం చేసింది. సర్పంచ్ వనజ చెక్ పవర్ రద్దు చేసే ఉద్దేశంతోనే రెండేళ్లలో ఏకంగా 6 ఎంక్వైరీ కమిషన్లు వేయించినట్లు విమర్శలు ఉన్నాయి. కూటమిలోని ఓ పార్టీకి చెందిన రాజేష్ అనే వ్యక్తి తరచూ అవినీతి ఆరోపణలు చేయడం దానికి జిల్లా అధికారులు సహకరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అవినీతి ఆరోపణల్లో సస్పెండైన పంచాయతీ కార్యదర్శిని మళ్లీ ఇక్కడే నియమించడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. విచారణకు వచ్చిన ప్రతిసారీ అధికారులు రికార్డులు పరిశీలించి అంతా బాగుందని వెళ్లడం.. ఆపై మరోమారు విచారణ కమిషన్ వేస్తుండటం అధికారుల ద్వంద్వ వైఖరికి నిదర్శనం.

బిల్లులున్నా అసత్య ప్రచారం

సింగరాయకొండలో 2021–22లో 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్ నిధులు రూ.20 లక్షలతో సుందర్‌నగర్, బాలయోగినగర్‌లో డ్రెయినేజీలు నిర్మించారు. బ్లీచింగ్, శానిటరీ మెటీరియల్ కొనుగోలుకు రూ.8 లక్షలు, బోరు, జంగిల్ క్లియరెన్స్, ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో నిర్మించిన కాలువలు, ఇతర సామగ్రి కొనుగోలుకు సుమారు రూ.12 లక్షలు, విద్యుత్ బిల్లు చెల్లింపునకు రూ.5 లక్షలు ఖర్చు చేశారు. ఈ మొత్తం రూ.45 లక్షల చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయని రాజేష్ అనే వ్యక్తి పదే పదే ఫిర్యాదు చేస్తుండగా అధికారులు సైతం వంత పాడుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా పనులకు సంబంధించి ఎంబుక్‌లు, ఆన్‌లైన్ బిల్లులను విచారణ అధికారుల ఎదుట ఉంచినా పదే పదే ఎంక్వైరీ కమిషన్లు ఎందుకు వేస్తున్నారో పంచాయతీ అధికారులే సెలవివ్వాలి. అప్పటి పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన నివేదిక ప్రకారమే బిల్లులు చెల్లించినట్లు సర్పంచ్ వనజ ఆధారాలతో సహా స్పష్టం చేసినా జిల్లా అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

విచారణ కమిషన్లు ఇలా..

గ్రామ పంచాయతీలో అవినీతి జరిగిందంటూ ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై 2023 ఫిబ్రవరి 15న, మళ్లీ అదే వ్యక్తి చేసిన ఫిర్యాదుపై 2023 ఏప్రిల్ 12న, మళ్లీ 2024 జూలై 23న, 2024 సెప్టెంబర్ 20న విచారణ కమిటీలు వేశారు. గత ఏడాది డిసెంబర్ 19న నియమించిన త్రీమెన్ కమిటీ విచారణ నివేదిక ఇంత వరకు బయటకు రాలేదు. కానీ ఈ నెల 18న మరో మారు విచారణ కమిటీ వేశారు. ఉద్దేశపూర్వకంగా ఓ వ్యక్తి చేస్తున్న ఆరోపణలపై ఐదు పర్యాయాలు విచారణ కమిషన్లు నియమించారని, దీనివల్ల పాలన కుంటుపడుతోందని ఇటీవల ఒంగోలు వచ్చిన పంచాయతీరాజ్ కమిషనర్ దృష్టికి సర్పంచ్ తీసుకెళ్లగా.. ఆమె కోరారంటూ విచారణ కమిటీని నియమించడం గమనార్హం.

విద్యుత్ బిల్లు చెల్లింపూ అవినీతేనా?

గత మూడేళ్లుగా టెండర్ ప్రకారం ఏడాది సుమారు రూ.9 లక్షల విలువైన శానిటరీ మెటీరియల్ సరఫరా చేస్తున్నా సదరు కాంట్రాక్టర్‌కు ఇంతవరకు డబ్బు చెల్లించలేదు. విచారణ పేరుతో నిధులు ఆపేస్తే పంచాయతీకి శానిటరీ మెటీరియల్ ఎవరు సరఫరా చేస్తారు. రూ.45 లక్షల అవినీతి జరిగిందంటూ ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదులో కరెంటు బిల్లు రూ.5 లక్షలు కూడా ఉంది. ప్రభుత్వానికి చెల్లించిన కరెంటు బిల్లులోనూ అవినీతి జరిగిందని ఆరోపణ చేశారంటే ఇదంతా కుట్ర కాక ఏమవుతుంది. దళిత మహిళను అయినందునే విచారణ పేరుతో మానసికంగా క్షోభకు గురిచేస్తున్నారు. అసత్య ఆరోపణలు చేసిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి. బిల్లుల చెల్లింపుపై విచారణను తాత్సారం చేయకుండా పూర్తి చేయాలి. అలాగే పంచాయతీలో ఇంటి పన్ను వసూళ్లలో అవినీతి, చెట్లు కొట్టేసి లక్షలాది రూపాయలు స్వాహా చేయడం, పాత సామగ్రి అమ్ముకుని సొమ్ము చేసుకోవడంపై పత్రికల్లో కథనాలు వచ్చాయి. పంచాయతీ తీర్మానం లేకుండా విద్యుత్ లైటింగ్ పనులు, రోడ్లు నిర్మించారు. వీటన్నింటిపై విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చాలి.

– వనజ, సింగరాయకొండ సర్పంచ్



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కనుల పండువగా గోవిందుని రథోత్సవం



భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారి ఉత్సవమూర్తులు



గజ వాహనంపై శ్రీవారు

కొనకనమిట్ల: వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం గోవిందుడి రథోత్సవం భక్తుల జయజయ ధ్వానాల మధ్య కనుల పండువగా సాగింది. భక్తుల గోవింద నామస్మరణతో వెలుగొండ క్షేత్రం మారుమోగింది. సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి వేద పండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాల నడుమ వెలుగొండ క్షేత్రంలో ఊరేగించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మహిళలు ఉత్సాహంతో శ్రీవారి రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు. ముందుగా స్వామివారికి వేద పండితులు ప్రసాదాచార్యులు, భార్గవాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవానికి ఉభయదాతలుగా గార్లదిన్నె గ్రామస్తులు, దేవస్థాన కమిటీ సభ్యులు వ్యవహరించారు. గజోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన భజంత్రీల సన్నాయి భక్తులను అలరించింది. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ఉత్సవ సేవా కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి పర్యవేక్షించారు. ఎస్సై రాజ్‌కుమార్ తమ సిబ్బందితో కలిసి పోలీస్ బందోబస్తు నిర్వహించారు. రథోత్సవాన్ని పురస్కరించుకుని పలు సత్రాల్లో భక్తులకు అన్న సంతర్పణ చేశారు. తిరునాళ్ల సందర్భంగా శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ, టీడీపీ నేతల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, చెంచులక్ష్మి, బ్రహ్మంగారి నాటకం, మహిళల కోలాట ప్రదర్శన, బొల్లావుల ఉత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

మెరిట్ కం రోస్టర్ విధానంలో సీనియార్టీ జాబితాలుండాలి

- బహుజన టీచర్స్ అసోసియేషన్ నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్చూరి మాధవరావు

ఒంగోలు సిటీ: ఉపాధ్యాయ సీనియారిటీ జాబితాలు మెరిట్ కం రోస్టర్ విధానంలో తయారు చేయాలని బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్చూరి మాధవ రావు అన్నారు. బహుజన్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్ర దేవ సహాయం అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏల్చూరి మాధవరావు మాట్లాడుతూ జిల్లా పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రకటించారన్నారు. ఆ జాబితాలు కేవలం మెరిట్ ఆధారంగా తయారు చేశారని, వాటి వలన ఎస్సీ, ఎస్టీ, బీసీ, అన్ని వర్గాల మహిళలు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని చెప్పారు. జాబితాలు వెంటనే సవరించాలని ఆయన కోరారు. ఈ విషయంపై సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారులతో చర్చించనున్నట్లు చెప్పారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పర్రె వెంకట్రావు మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి మెరిట్ కం రోస్టర్ విధానం కోసం బహుజన టీచర్స్ అసోసియేషన్ పోరాటం చేస్తోందని, బహుజన ఉపాధ్యాయ హక్కుల పరిరక్షణ బీటీఏ లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలని, 12 వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలని కోరారు. సరెండర్ లీవ్స్ ఇంత వరకు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలో చర్చించి సమస్యలు పరిష్కారం కోసం ప్రత్యక్ష కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పారాబత్తిన జాలరామయ్య, రాష్ట్ర కార్యదర్శి మద్దిరాల శరత్ చంద్ర బాబు, జిల్లా నాయకులు జగన్నాథం ప్రసాదరావు, గంటనపల్లి శ్రీనివాసులు, నూకతోటి కుమార స్వామి, కొండమూరి కొండల రాయుడు, చెక్క కోటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

ఆటో బోల్తాపడి ఒకరు మృతి



మృతి చెందిన వీరబ్రహ్మచారి

దర్శి: ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడటంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి దర్శి మండలంలోని తూర్పు వెంకటాపురం గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై మురళి కథనం మేరకు.. మండలంలోని తూర్పు వెంకటాపురం గ్రామానికి చెందిన గుంటూరు వీరబ్రహ్మచారి(60) దర్శిలో కార్పెంటర్‌గా పనిచేస్తుంటారు. రోజులాగే ఆదివారం తన పని ముగించుకుని ఎర్ర ఓబనపల్లి అగ్నిపురి కాలనీకి చెందిన గుంటూరు పెద్దన్న ఆటోలో ఎక్కారు. డ్రైవర్‌కు ఎడమ వైపు కూర్చుని గ్రామానికి బయలుదేరారు. గ్రామ శివారులోని మూలమలుపులో చప్టా వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వీరబ్రహ్మచారి అక్కడికక్కడే మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సుడిగాలులతో అరటి రైతులకు నష్టం



నేలమట్టమైన అరటితోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖాధికారి సాయిశ్వేత

అర్ధవీడు: మండలంలో శనివారం రాత్రి వీచిన భారీ సుడిగాలులు, కొద్దిపాటి వర్షానికి అరటి రైతులు నిండా మునిగారు. అంకభూపాలెం గ్రామానికి చెందిన వెంకటస్వామి 3 ఎకరాల అరటి తోట దెబ్బతినడంతో దాదాపు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లింది. బొల్లుపల్లి గ్రామానికి చెందిన రైతులు కొప్పుల అర్జున్‌రావు, కొప్పుల నారాయణ 4 ఎకరాల్లో సాగు చేసిన అరటి తోట నేలవాలడంతో రూ.6 లక్షల వరకు నష్టపోయారు. అర్ధవీడు గ్రామానికి చెందిన సర్వేశ్వరరావు, దొనకొండ గ్రామంలో మరో ఇద్దరు రైతులకు చెందిన అరటి తోటలు ఈదురుగాలు ధాటికి నేలమట్టమయ్యాయి. దెబ్బతిన్న తోటలను ఆదివారం ఉద్యానవన శాఖాధికారిణి సాయిశ్వేత పరిశీలించారు. కాగా ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజీ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజీ శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: విద్యారంగ సమస్యలు, ఆర్థిక బకాయిల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజీ శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన బేరర్ల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పదోన్నతుల సీనియార్టీ జాబితాలోని తప్పులను సరిచేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం మోడల్ ప్రైమరీ పాఠశాలల పేరుతో పక్కనున్న ప్రాథమిక పాఠశాలలను విలీనం చేస్తోందన్నారు. దీనివలన సింగిల్ టీచర్ స్కూల్స్ పెరిగిపోయే పరిస్థితి ఉందన్నారు. 3, 4, 5 తరగతులను ఎక్కడా విలీనం చేయవద్దన్నారు. ప్రతి పంచాయతీకి విలీనంతో సంబంధం లేకుండా ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలన్నారు. యూపీ స్కూల్స్‌ను కొనసాగించాలన్నారు. హైస్కూళ్లలో తెలుగు మీడియం కొనసాగించాలని కోరారు. విద్యారంగ ఆర్థిక సమస్యల పరిష్కారానికి రాష్ట్ర యూటీఎఫ్ దశల వారీగా సదస్సులు నిర్వహిస్తోందన్నారు. ఏప్రిల్ 5వ తేదీ తిరుపతిలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10వ తరగతి స్పాట్ వేల్యుయేషన్‌లో చిన్నపిల్లలు ఉన్న వారికి, గర్భిణులకు, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి, దివ్యాంగులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. యూటీఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ ఇటీవల నిర్వహించిన బాలోత్సవాన్ని జయప్రదం చేసినందుకు, రామిరెడ్డి మెడికల్ క్యాంపును విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఓ.వి.వీరారెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, జిల్లా సహాధ్యక్షురాలు ఉమామహేశ్వరి, ఐ.వి.రామిరెడ్డి, కోశాధికారి ఎస్.చిన్నస్వామి, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తపట్నం: మండలంలోని మోటుమాల గ్రామంలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.అరుణ తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 40 బైపీసీ సీట్లు, ఇంటర్ సెకండియర్‌లో 9 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా చేరదలచిన వారు ఏప్రిల్ 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డ్రాపౌట్ విద్యార్థులు, అనాథ పిల్లలు, తల్లిదండ్రులు లేని పిల్లలకు ప్రత్యేక అవకాశాలు ఉంటాయన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్లో మెసేజ్ ద్వారా సమాచారం వస్తుందన్నారు. పూర్తి వివరాలకు 9490398467 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పొలంలో సోలార్ ప్యానళ్లు చోరీ



సోలార్ ప్యానళ్లు చోరీ అయ్యాయని చూపుతున్న రైతు

కొనకనమిట్ల: వ్యవసాయ భూముల్లో ఇద్దరు రైతులు ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానళ్లను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటన శనివారం రాత్రి మండల కేంద్రమైన కొనకనమిట్లలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వేంపాటి వెంకటరెడ్డి, వేంపాటి వెంకటేశ్వర్లు ఇటీవల తమ పొలాల్లో పొగాకు సాగు చేశారు. పొగ మొక్కలకు బోరు ద్వారా నీటి తడులు అందించేందుకు రూ.2 లక్షలు వెచ్చించి సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా సోలార్ ప్యానళ్లు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై రాజ్‌కుమార్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీశైలానికి పెరిగిన భక్తుల రద్దీ

- ఉగాది సందర్భంగా భారీగా తరలివెళ్తున్న భక్తులు
- భక్తుల సౌకర్యార్థం రాత్రివేళ ప్రయాణాలకు అనుమతినిచ్చిన అటవీశాఖ
- ఈ నెల 27వ తేదీ రాత్రి నుంచి 31వ తేదీ వరకు అనుమతులు



శ్రీశైలం వెళ్లేందుకు పెద్దదోర్నాల చెక్‌పోస్ట్ వద్ద బారులు దీరిన వాహనాలు




శివుని చిత్రపటాలతో అలంకరించిన ప్రత్యేక వాహనాలలో శ్రీశైలం వెళ్తున్న కర్ణాటక వాసులు

పెద్దదోర్నాల: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం పుణ్యక్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాలలో పాల్గొనేందుకు భక్తులు భారీగా తరలివెళ్తున్నారు. శ్రీశైలం వెళ్లే యాత్రికులు, భక్తులతో రెండు రోజులుగా పెద్దదోర్నాల మండల కేంద్రంలో రద్దీ నెలకొంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీశైలం ఘాట్‌రోడ్డులో రాత్రివేళ ప్రయాణాలకు అటవీశాఖ అనుమతులిచ్చింది. ఈ నెల 27వ తేదీ రాత్రి నుంచి 31వ తేదీ వరకు రాత్రి వేళల్లో కూడా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నిరంతరం నల్లమల ఘాట్‌రోడ్డులో ప్రయాణించే వెసులుబాటు కల్పించినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి జీవన్‌కుమార్ తెలిపారు.

అధిక సంఖ్యలో తరలివస్తున్న కన్నడిగులు...

కర్ణాటక నుంచి తమ ఇంటి ఆడపడుచు భ్రమరాంబదేవి అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించేందుకు కర్ణాటక వాసులు పలు వాహనాలలో శ్రీశైలానికి భారీగా తరలివెళ్తున్నారు. ఉగాది పర్వదినాన్ని కన్నడిగులు శ్రీశైలంలో నిర్వహించడం ఆనవాయితీ కావడంతో రెండు రోజుల నుంచే భారీఎత్తున భక్తులు శ్రీశైలం చేరుకుంటున్నారు. శివుని చిత్రపటాలతో అలంకరించిన ప్రత్యేక వాహనాలతో భక్తులు వస్తున్నారు. అధిక శాతం భక్తులు కాలినడకన నల్లమల అటవీ ప్రాంతంలో నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి చేరుకుంటున్నారు. వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో పలువురు భక్తులు రైళ్ల ద్వారా మార్కాపురం చేరుకుని అక్కడి నుంచి శ్రీశైలం వస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం శ్రీశైలం పుణ్యక్షేత్రంలో దేవస్థాన కమిటీ అనేక ఏర్పాట్లు చేసింది. ఉగాది బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీశైలంలో నిత్యం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వరపూజ, శివసంకల్పం, స్వస్తిపుణ్యాహం, చండీశ్వరపూజ, కంకణపూజ, కంకణధారణ, వాస్తుపూజ, వాస్తుహోమం, నవగ్రహ మండపారాధన తదితర కార్యక్రమాలతో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. భ్రమరాంబాదేవి ఆలయంలో విశేష కుంకుమార్చనలు, చండీహోమం తదితర కార్యక్రమాలతో పాటు స్వామివారి కళ్యాణ మహోత్సవం, శయన ఉత్సవాలను ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు భక్తులు ఆసక్తి చూపుతుండటంతో పండుగకు ముందే రద్దీ అధికంగా ఉంది.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి



ప్రసాద్ (ఫైల్)

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి పొదిలి ప్రసాద్ శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మరణించారు. గతంలో ఆయన మునగపాడు, వెలిగండ్ల, సిద్ధవరం, గొట్లగట్టు, గ్రామాలకు పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. గత కొంత కాలంగా పని ఒత్తిడితో సతమతమవుతూ, తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే గుండె పోటుతో కుప్పకూలి మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసాద్ మృతిపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.